మహబూబాబాద్ రూరల్: విద్యాబోధనపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని జమాండ్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన పలు కాలనీల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో రకరకాల పీజుల పేరుతో అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, అదే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్స్ ఉచితంగా ఇవ్వడంతోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సమ్మెట వెంకటేశ్వర్లు, ప్రభావతి, సరిత, బ్రహ్మం, మహేశ్వర్ పాల్గొన్నారు.

సర్కార్ బడిలో పిల్లలను చేర్పించాలి

డోర్నకల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మల్లాయకుంటతండా ఎంపీపీఎస్ హెచ్ఎం అంగోత్ రమేశ్ కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మల్లాయకుంటతండాలో ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రేణుక, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: మల్లాయకుంట తండాలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం రమేశ్

రికార్డులను సరిగ్గా నిర్వహించాలి

బయ్యారం, జూన్ 10: ఎరువులు, విత్తన దుకాణ యజమానులు స్టాక్, విక్రయాలకు సంబంధించి రికార్డులను సరిగ్గా నిర్వహించాలని వ్యవసాయ అధికారి రాంజీనాయక్, ఎస్సై ఉపేందర్ సూచించారు. సోమవారం వారు మండలంలోని రామచంద్రాపురంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ టీంతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రోజువారీగా స్టాక్‌బోర్డ్‌ను నిర్వహించాలని సూచించారు.

ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో రాంజీనాయక్, ఎస్సై ఉపేందర్

ప్రజావాణిలో 113 వినతులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 10: ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా రెండు నెలలపాటు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని, తిరిగి సోమవారం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. 113 మంది నుంచి పలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటిలో రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల పేర్ల మార్పు, భూమి, పింఛన్‌దారులు, గొల్ల, కురుమల సబ్సిడీ డీడీలు, ఇంటి అనుమతి వంటి పలు సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, లెనిన్‌వత్సల్ టోప్పో, జడ్పీ సీఈవో నర్మద, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

వైద్యుల కొరతను తీర్చండి

గార్ల : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో వైద్యుల కొరతను తీర్చడంతోపాటు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు బీజేపీ నాయకురాలు, ఎంపీటీసీ నాగమణి ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్యాధికారితో మాట్లాడి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి

డోర్నకల్, జూన్ 10: రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన ఘటన మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. జీఆర్పీ ఇన్‌చార్జి ఎస్సై భాస్కర్‌రావు కథనం ప్రకారం.. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో సుమారు 45 సంవత్సరాలు ఉన మహిళ రైలు నుంచి జారి పడి మృతి చెందింది. ఆమె వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు డోర్నకల్ జీఆర్పీ పోలీసుల (8712658600)నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు దగ్ధం

కేసముద్రం, జూన్ 10: షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని ఓ మెడికల్ షాప్ దగ్ధమైన ఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. షాపు యజమాని నరేశ్ కథనం ప్రకారం.. వ్యవసాయ మార్కెట్ రోడ్డులో నరేశ్ సాయిరాం మెడికల్ షాపును నడుపుతున్నాడు. సోమవారం తెల్లవారు జామున 2గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు, పక్కనే ఉన్న ఆర్ ఎంపీ వెంకటేశ్వర్లు క్లినిక్ కాలి బూడిదైంది. ఫర్నిచర్‌తోపాటు మెడికల్ షాపులోని సుమారు రూ.15 లక్షల మందులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రెవెన్యూ సిబ్బంది, ఆర్ఐ చెరుకుబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని మెడికల్‌షాప్ యాజమాని కోరాడు.

మంటల్లో కాలి బూడిదైన మెడికల్ షాపు

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 10: ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ వైద్యులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరుగుతూ రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుకున్నారు. వైద్యులు, సిబ్బంది రోగులపై దురుసుగా ప్రవర్తించొద్దని, అవసరమైన వైద్యం వెంటనే అందేలా డాక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో జగదీశ్వర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

చికిత్స పొందుతూ ఒకరు మృతి

సురేశ్ (ఫైల్)

పెద్దవంగర, జూన్10 : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో జరిగింది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయిన పల్లి గ్రామానికి చెందిన దార కిశోర్ కుటుంబ సభ్యులతో కలిసి కారులో నాంచారిమడూరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని అవుతాపురం గ్రామంలోని పాలకుర్తి–నాంచారిమడూర్ రహదారిపై కారు అదుపు తప్పి ముగ్గురిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోచంపల్లి గ్రామానికి చెందిన కందూరు సురేశ్(30)కు తీవ్రగాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరు పోచంపల్లికి చెందిన కుందూరు రవి, అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్‌కు గాయాలు కావడంతో తొర్రూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సురేశ్ తండ్రి సోమేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీఈటీ కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లికుదురు, జూన్ 10 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భూక్యా కిషన్ కుటుంబానికి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూ.55వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము రాజేందర్ మాట్లాడుతూ.. కిషన్ వృత్తిరీత్యా ఎంతోమంది విద్యార్థులను క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇచ్చి వారి గుండెల్లో నిలిచిపోయాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు జీ నాగయ్య, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ఓ జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ ఐలయ్య, మాజీ ఫిజికల్ డైరెక్టర్ వెంకటయ్య, విజయ్ చందర్, కొప్పుల శంకర్, కంచర్ల ప్రభాకర్, సునీల్, శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

కిషన్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును సోమవారం ఎర్రవెల్లిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సీతామహాలక్ష్మీ దంపతులు వేర్వేరుగా కలిశారు. జిల్లా సీనియర్ నాయకులు ఉన్నారు.

కేసీఆర్‌తో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఏఐటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సక్రు

సక్రు

గార్ల, జూన్ 10: ఏఐటీఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జీ సక్రు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కొత్తగూడెంలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన తెలంగాణ ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం సదస్సులో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సక్రు మాట్లాడుతూ.. ఆదివాసీ హక్కుల పోరాటానికి కృషి చేస్తామని తెలిపారు.

క్యాన్సర్‌తో చిన్నారి మృతి

ఆయిషా(ఫైల్)

గార్ల, జూన్ 10: క్యాన్సర్ వ్యాధితో 15 నెలల చిన్నారి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని తహసీల్దార్ బజార్‌లో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గార్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ బజార్‌కు చెందిన ఎం షఫీ రెండో కూతురు అయిషా (15నెలలు)కు క్యాన్సర్ సోకగా, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. చిన్నారి కుటుంబలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ వెంటనే అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. సోమవారం వారు డీఈవో రామారావుతో మాట్లాడి, వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని వండర్ కిడ్జ్, మహర్షి విద్యాలయం, ఏకశిలా ఏంజల్స్ వంటి ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా నోట్‌బుక్స్‌ను అమ్ముతున్నాయని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పాఠశాలపై విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గుగులోత్ సూర్యప్రకాస్, సింహాద్రి, ఏఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేశ్, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి మహేశ్, వీజేఎస్ నాయకులు మనోజ్ పాల్గొన్నారు.

బావిలో పడి యువతి మృతి

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి చెందిన ఘటన మండల శివారులో సోమవారం జరిగింది. ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని సికింద్రాబాద్ తండాకు చెందిన భూక్యా హుస్సేన్, హక్రీ దంపతుల కూతురు అనిత (19) ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్నది. సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్లిన అనితను మంచినీళ్ల కోసం బావి వద్దకు పంపించారు. బావిలో నుంచి మంచినీళ్లు తోడుతున్న క్రమంలో జారి అందులో పడిపోగా, బయటకు తీసే క్రమంలో మృతి చెందింది. తల్లి హక్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Wanted Experience (M&F) Local & Kerala Teachers for Primary Hindi, English higher section Hindi Good Salary for fluent English, ELOHIM SCHOOL, Kommala, Wgl. 9390112329, 7702026999.
NTW-318919

CHANGE OF NAME

★I, GOPAGONI RAVI, S/o. GOPAGONI SAYABJILLA, R/o. H.No. 5-79, Main Road, Narmetta (V&M), Jangaon Dist., T.S., My Father Name is GOPAGONI SAYABJILLA alias SAYABJEELA is one and the same all further purposes.
NTW-5698

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హైదరాబాద్ విజేత

విజేత జట్టుకు నగదు, షీల్డ్ అందజేస్తున్న సీఐ ఉపేందర్‌రావు

డోర్నకల్, జూన్ 10: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఖాజాబాయ్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలిచింది. మొదటి స్థానంలో హైదరాబాద్, ద్వితీయ స్థానంలో ప్రకాశం, మూడో స్థానంలో విజయవాడ స్కై, నాలుగో స్థానంలో బంజరా ప్రతాప్‌రెడ్డి మెమోరియల్, ఐదో స్థానంలో కరీంనగర్, ఆరో స్థానంలో గొల్లచర్ల ఖాజాబాయ్ మెమోరియల్ జట్లు నిలిచాయి. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు విజేతలకు నగదు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు భీమనబోయిన సంతోశ్, కొడవండ్ల యాదగిరి, చెట్టుపల్లి ఉప్పలయ్య, ప్రసాద్, పగిడిపల్లి రామకృష్ణ, చెరుకుపల్లి శ్రీనివాస్, సురేశ్, మహేశ్, సాగర్, దాతలు పాల్గొన్నారు.

ఉపాధి పథకంపై కేంద్రం కుట్రలు

ఎన్డీ సబ్ డివిజన్ కార్యదర్శి మురళీకృష్ణ

ధర్నా అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

బయ్యారం, జూన్ 10: ఉపాధి పథకానికి నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. రెండేళ్లలో 8 కోట్ల మందిని ఉపాధి పథకం నుంచి తొలగించినట్లు తెలిపారు. పథకం అమలుకు తక్షణమే ప్రత్యేక యంత్రాంగాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కూలీలకు వంద రోజుల పనిదినాలు సరిపోవడం లేదన్నారు. రోజువారీ వేతనం రూ.300 చెల్లించాలని చట్టంలో ఉన్నా, రూ.200 కూడా ఇవ్వడంలేదన్నారు. తక్షణమే పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలని, సామాజిక తనిఖీ పేరిట రికవరీలకు స్వస్తి పలకాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉపాధి కూలీలను ఏకంచేసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు రామగిరి భిక్షం, న్యూడెమోక్రసీ మైదాన మండల కార్యదర్శి మాదంశెట్టి నాగేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకులు మేకపోతుల నాగేశ్వరరావు, బీరెడ్డి సంగన్న, ఏనుగుల మురళి, ధరావత్ మంగీలాల్, ఐలయ్య, రెడ్డిమల్ల విశ్వనాథం, లింగమల్లు, హన్మ, శేషు, నాగేశ్వరరావు, నేతకాని రాకేశ్, సమ్మక్క, కమలమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి ఎరువుల దుకాణాదారులతో మాట్లాడుతున్న ఏవో మంజుఖాన్

రైతులకు రసీదు అందించాలి

దంతాలపల్లి, జూన్ 10: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణాదారులు తప్పనిసరిగా రసీదు అందజేయాలని ఏవో మంజూఖాన్ సూచించారు. దంతాలపల్లి మండల నూతన ఏవోగా బాధ్యతలు స్వీకరించిన మంజూఖాన్ సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎరువులు, విత్తన వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సందీప్, దీక్షిత్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గార్ల, జూన్ 10: గార్ల పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పని చేసిన మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మల్లికంటి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం దాతలు గంగావత్ రాంసింగ్‌నాయక్, ఎస్‌కే ఖదీర్‌బాబా మార్బుల్ సహకారంతో రూ. 50వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ రమేశ్, బీరవెల్లి సంజీవరెడ్డి ఉపాధ్యాయులు శ్రీనివాస్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న రాంసింగ్ నాయక్, ఖదీర్‌బాబా

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి: ఎంఈవో

నెల్లికుదురు, జూన్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పాఠశాలల ప్రారంభం నాటికే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని మండల విద్యాశాఖ అధికారి గుగులోత్ రాము అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని టెంపుల్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనులు పూర్తవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ నెల్లికుదురు మండలంలోని 31 పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు టెంపుల్ కాలనీ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంఈవో రాము

రామోజీ రావు చిత్రపటం వద్ద నివాళు లర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రామోజీరావుకు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్, జూన్ 10: ఈనాడు సంస్థల యజమాని రామోజీరావుకు సోమవారం పట్టణంలో పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పేపర్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షులు శంకర్, సురేశ్, శ్రీనివాస్, సత్యప్రసాద్, వెంకట్, ఇబ్రహీం, ముత్తయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 10: మానుకోట జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పోకు వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పట్టణంలోని వండర్ కిడ్జ్ పాఠశాల, బయ్యారం మండలంలోని గంధంపల్లి అక్షర పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేకున్నా నడుపుతున్నారని, స్కూల్‌బుక్స్, యూనిఫామ్‌ల పేరుతో తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అనే కమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రమేశ్

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తొర్రూరు, జూన్ 10 : తొర్రూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎన్పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్మన్ కేవీస్ గుట్టయ్య తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. విద్యుత్ బిల్లుల్లో సమస్యలు, నూతన సర్వీసుల విడుదల, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులు తదితర సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. తొర్రూరు, చిన్నవంగర, పెద్దవంగర సబ్‌స్టేషన్ల పరిధిలో వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి ఏవోగా మురళీమోహన్

మురళీమోహన్

తొర్రూరు, జూన్ 10 తొర్రూరు, పెద్దవంగర మండలాల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా యక్కలదేవి మురళీమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏవో కుమార్‌యాదవ్ జీలుగ విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ వ్యవహారంలో 4 రోజుల క్రితం సస్పెండ్ అయ్యారు. ప్రస్తుతం డోర్నకల్ రెగ్యులర్ వ్యవసాయ అధికారిగా పని చేస్తున్న మురళీమోహన్‌ను తొర్రూరు, పెద్దవంగర మండలాలకు ఇన్‌చార్జి ఏవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.